క్లుప్తంగా

భక్తిప్రపత్తులతో వరలక్ష్మీ వ్రత పూజలు



సహాయనిధి చెక్కు అందజేస్తున్న రాస్ ప్రతినిధులు

తిరుపతి కల్చరల్: రాస్ మహిళా పొదుపు సంఘాల ఆధ్వర్యంలో ఓటేరులో శుక్రవారం సామూహిక వరలక్ష్మీవ్రత పూజలు భక్తిప్రపత్తులతో నిర్వహించారు. లక్ష్మీదేవిని కొలువుదీర్చి వేద పండితులు శాస్త్రోక్తంగా మహిళలతో వ్రత పూజలు చేయించారు. రాస్ మహిళా పొదుపు సంఘాల సంచాలకుడు వీ.నాగరాజు మాట్లాడుతూ, మహిళలు సామూహిక వ్రతాలు, క్రతువులు, నోములు చేస్తే ఆధ్యాత్మికత, కుటుంబ గౌరవం పెపొందుతుందన్నారు. వ్రత పూజలతో సిరిసంపదలు, ఆయురారోగ్యాలు, భోగభాగ్యాలు సిద్ధిస్తాయని పేర్కొన్నారు. శ్రీనివాస పురం క్లస్టర్‌లోని 3 సంఘాలలో మృతుల కుటుంబ సభ్యులకు సహాయనిధిగా చెక్కు రూపేణా 1,55,000 రూపాయలు, అలాగే టైలరింగ్ శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లు, నిరుపేదలకు చేతికర్రలు, దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాస్ సిబ్బంది రాణి, భార్గవి, కవిత, మునిరాజ, పుష్ప, లక్ష్మమ్మ, భారతమ్మ, లలితమ్మ, సుగుణమ్మ, మహిళలు పాల్గొన్నారు.

నేడు మహతిలో ప్రత్యేక ప్రతిభావంతుల నృత్య ప్రదర్శనలు



మాట్లాడుతున్న ప్రేరణ హెల్పింగ్ సొసైటీ ప్రతినిధి ఆకాష్

తిరుపతి కల్చరల్: తమ సొసైటీ 18వ వార్షికోత్సవం సందర్భంగా మహతి కళాక్షేత్రంలో శనివారం సాయంత్రం 5 నుంచి రాత్రి 9 గంటల వరకు ప్రత్యేక ప్రతిభావంతులతో నృత్య, గాన సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్టు ప్రేరణ హెల్పింగ్ సొసైటీ ప్రతినిధి ఆకాష్ తెలిపారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. లాభాపేక్ష లేకుండా తమ సొసైటీ సామాజిక సేవా కార్యక్రమాలతో చేయూతనిస్తున్నామని, ఈ దిశగా ప్రత్యేక ప్రతిభావంతుల్ని ప్రోత్సహించేందుకు 26 సంస్థలకు చెందిన ప్రత్యేక ప్రతిభావంతులతో ప్రదర్శనలు ఏర్పాటు చేశామని, ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో సొసైటీ ప్రతినిధులు ఐశ్వర్య, జయసూర్య, తరుణ్ తేజ లక్ష్మీప్రియ, బలరాం, సౌందర్య, ఫణీంద్ర పాల్గొన్నారు.

'మెగా స్టార్' అభిమానుల అన్నదానం



రుయా ఆస్పత్రి వద్ద అన్నదానం చేస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

తిరుపతి అన్నమయ్య సర్కిల్: కేంద్ర మాజీ మంత్రి, పద్మ విభూషణ్ డాక్టర్ చిరంజీవి 70వ జన్మదిన వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మెగా స్టార్ అభిమానులు, జనసేన శ్రేణులతో కలసి ఎమ్మెల్యే, పార్టీ నగర అధ్యక్షుడు రాజారెడ్డి రుయా హాస్పిటల్ వద్ద కేక్ కట్ చేసి అన్నదానం చేశారు. కార్యక్రమంలో బాబ్జి, సుమన్ బాబు, మునస్వామి, రాజమోహన్, ఆనంద్, జీవకోన సుధా, లక్ష్మీపతి, హేమంత్, పురుషోత్తం, సాయి, ఆది, రమేష్ నాయుడు, సుమంత్, సుధాకర్, మధు, జీవన్, శ్రావణ్, అమృత, చందు, మార్కెట్ యువరాజ్, ముఖేష్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

దామలచెరువులో..

పాకాల : సినీ నటుడు చిరంజీవి జన్మదినం పురస్కరించుకుని శుక్రవారం దామలచెరువులో చిరంజీవి అభిమానులు వేడుకలు నిర్వహించారు. అనంతరం భగవాన్ శ్రీ రామతీర్థ సేవాశ్రమంలో వృద్ధులకు అన్నదానం చేశారు. అలాగే శివాలయంలో పూజలు చేసి ఆలయ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో చిరు ఫ్యాన్స్ సేవా సమితి అధ్యక్షుడు కక్కి గోపాలకృష్ణ, ప్రతినిధులు పురుషోత్తం, మదన్‌మోహన్, వాసురాయల్, చరణ్, జనార్దన్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

కరెంటు స్తంభాలకు కేబుల్స్ తొలగించండి

చంద్రగిరి: కరెంటు స్తంభాలకు ప్రమాదకరంగా వేలాడుతున్న కేబుల్స్‌ను ఆపరేటర్లు తొలగించాలని ట్రాన్స్‌కో ఈఈ రెడ్డెప్ప రెడ్డి హెచ్చరించారు. చంద్రగిరి సబ్ డివిజన్ కార్యాలయంలో గురువారం ఆయన అధికారులతో కేబుల్స్‌పై సమీక్షించారు. విద్యుత్ స్తంభాలకు వేలాడుతున్న కేబుల్స్ ప్రమాదకరంగా ఉన్నాయని ఫిర్యాదులు అందుతున్నాయని, దీనిపై కేబుల్ ఆపరేటర్లు స్పందించకపోతే చర్యలకు ఉపక్రమించాలని సిబ్బందిని ఆదేశించారు. అలాగే, వినాయక చవితి ఉత్సవాలలో మండపాలకు విద్యుత్ కనెక్షన్ నిమిత్తం నిర్వాహకులు తమ అనుమతి తప్పనిసరి తీసుకోవాలన్నారు. సమావేశంలో డీఈ శేషాద్రి రెడ్డి, ఏఈలు నాగరాజు, వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

విలపింఛైన్ !

- అర్హులైన దివ్యాంగులకు తీరని అన్యాయం
- చంద్రబాబుకు శాపనార్థాలు పెడుతున్న బాధితులు

పుట్టుకతోనే బధిరుడు



ఇక్కడ చిత్రంలో కనిపిస్తున్న వ్యక్తి పేరు పరశురాం. రామచంద్రాపురం మండలం కొత్తవేపకుప్పం గ్రామస్తుడు. పుట్టుకతోనే బధిరుడు. ఎవ్వరితోను మాట్లాడలేడు. ఎవరు ఏం చెప్పినా వినపడదు. పదేళ్లుగా పింఛను పొందుతున్నాడు. గత ప్రభుత్వ హయాంలో ఆరు వేలు పింఛను ఇచ్చేవారు. దీనిపై ఆధారపడి జీవించేవాడు. మందులు తెచ్చుకునేవాడు. ఇప్పుడు పింఛను రద్దు చేస్తూ నోటీసిచ్చారు. అంగవైకల్యం చాలా తక్కువగా ఉన్నట్టు డాక్టర్లు సర్టిఫికెట్ ఇవ్వడమే దీనికి కారణం. ఇప్పుడు ఈ బధిరుడు ఎలా బతకాలి..? తన గోడు చెప్పాలన్నా నోరు రాదే..! అయ్యోపాపం

తిరుపతి రూరల్: కూటమి ప్రభుత్వం కొందరు దివ్యాంగుల పింఛన్లు రద్దు చేయడంతో బాధితులు లబోదిబోమంటున్నారు. వయోవృద్ధులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు, అనారోగ్యంతో మంచం పట్టిన వారి వివరాలు సేకరించి, గుట్టుగా వారి ఇళ్లకు వైద్యులను పంపి, అంగ వైకల్యానికి సంబంధించిన శాతం తగ్గించేసి, ఏకంగా పింఛన్లు రద్దు చేసినట్లు నోటీసులు ఇవ్వడంతో దివ్యాంగులకు దిక్కుతోచడం లేదు. గత ప్రభుత్వం రూ.15వేలు పింఛన్ ఇస్తుంటే, ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఆ కేటగిరీలో ఉన్న చాలామందికి రూ.6వేలు, రూ.4,250లు చేయడంపై మండిపడుతున్నారు. చంద్రబాబు పింఛన్ల ఏరివేతతో తమ కడుపు కొడుతున్నారని దుమ్మెత్తిపోస్తున్నారు. చంద్రగిరి నియోజకవర్గ వ్యాప్తంగా ఆరు మండలాల్లో గత ప్రభుత్వంలో ఆరోగ్య పింఛన్లు (రూ.15000) అందుకుంటున్న వారి సంఖ్య 260మంది ఉండగా, అందులో ఒకరు చనిపోవడంతో 259 మందిని అధికారులు రీ–వెరిఫికేషన్ చేశారు. రీ వెరిఫికేషన్ తరువాత 109మందికి రూ.15వేలు కాకుండా రూ.6వేలు, మరో 9 మందికి రూ.4వేలు, కేవలం 113 మందికి మాత్రమే రూ.15వేలు పింఛను అందేలా సిఫార్సులు చేశారు. 28 మందికి పింఛను పూర్తిగా రద్దు చేశారు. అలాగే, దివ్యాంగుల పింఛన్లు 5,631 పింఛన్లు (రూ.6వేలు) పంపిణీ చేస్తుండగా 467మందిని రూ.4వేలు పింఛనుకు మారుస్తూ సదరన్ సర్టిఫికెట్లలో అంగవైకల్య శాతం తగ్గించేశారు. మరో 1,303 మందికి ఏకంగా పింఛను ఇవ్వాల్సిన అవసరం లేదని..వారికి 40శాతం కంటే తక్కువ వైకల్యాన్ని నమోదు చేసి సదరన్ సర్టిఫికెట్లు ఇచ్చారు. దీనిపై బాధితుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఏళ్ల కాలంగా పింఛన్లు తీసుకుంటున్న తమను ఇప్పుడు చంద్రబాబు రోడ్డున పడేశారని శాపనార్థాలు పెడుతున్నారు.



రాజకీయంగానే నా పింఛను తీసేశారు



నా కుడి చేయి వేళ్లు పూర్తిగా తొలగించారు.. వేళ్లు లేకుండా ఆ చేతికి పట్టు రాదు. పదేళ్లుగా పింఛనుపై అవసరమైన మందులు తెచ్చుకునేవాడిని. కుటుంబ పోషణకూ ఇదే ఆధారం. గత ప్రభుత్వం ఇంటి దగ్గరకే పింఛను ఇచ్చింది. ఇప్పుడు పింఛను తీసేశారు. ఈ ప్రభుత్వం వచ్చి రీ–వెరిఫికేషన్‌కు చంద్రగిరి ఆసుపత్రికి రమ్మన్నారు. అక్కడకు వెళితే 53శాతం అంగవైకల్యం ఉందని సదరన్ సర్టిఫికెట్ కూడా ఇచ్చారు. నేను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మద్దతుదారునని రాజకీయంగా నా పింఛను తీసేశారు. ఇది దుర్మార్గం.

–ఎల్లయ్య, దివ్యాంగుడు, బొప్పరాజుపల్లె

ముస్లింలనూ నట్టేట ముంచిన బాబు!

- అబద్ధపు హామీలతో నయవంచన
- పెద్ద మసీదు వద్ద ముస్లింలతో కలిసి భూమన అభినయ్‌రెడ్డి నిరసన



ముస్లింలతో కలిసి నిరసన వ్యక్తం చేస్తున్న భూమన అభినయ్‌రెడ్డి

తిరుపతి మంగళం : ఎన్నికల్లో అడ్డగోలుగా, అబద్ధపు హామీలు గుప్పించి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రజలు, ముస్లిం మైనారిటీలకు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో పూర్తిగా వైఫల్యం చెందిందని వైఎస్సార్‌సీపీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి మండిపడ్డారు. శుక్రవారం తిరుపతి మహతి ఆడిటోరియం సమీపంలోని పెద్ద మసీదు వద్ద ముస్లింలతో కలిసి ఆయన ఆందోళన చేసి మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర కాలం అవుతున్నా ముస్లింలకు ఇచ్చిన హామీలలో ఒక్కటీ నెరవేర్చకుండా చంద్రబాబు మోసం చేస్తున్నారని విమర్శించారు. అరకొరగా పథకాలు అమలు చేయడంతో తప్పితే నమ్మి ఓట్లేసిన ముస్లింలను కూడా నట్టేటముంచారన్నారు. అధికారంలోకి వస్తే మసీదుల నిర్వహణకు ప్రతి నెలా రూ. 5వేలు, 50 ఏళ్లు నిండిన ముస్లిం, మైనారిటీలకు పెన్షన్ ఇస్తానని, దుల్హాన్ పథకం కింద రూ.లక్ష ఆర్థిక సాయం, ముఖ్య పట్టణాల్లో ఈద్గాలకు, కబరస్థాన్‌లకు స్థలాలు కేటాయిస్తామని, నూర్ బాషా కార్పొరేషన్ ఏర్పాటు చేసి ప్రతిఏటా రూ. వంద కోట్లు కేటాయిస్తామని, ఇమామ్, మౌజీలకు గౌరవవేతనం కింద ప్రతి నెలా రూ. 10వేలు, రూ.5వేలు ఇస్తామని ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటైనా నెరవేర్చారా? అని సూటిగా ప్రశ్నించారు. హామీలను నెరవేర్చకపోతే ప్రజలు, ముస్లింల పక్షాన నిలబడి ఉద్యమిస్తామని హెచ్చరించారు. తొలుత ఆయన మసీదులో ముస్లింలతో కలిసి ప్రార్థనలు చేశారు.

శ్రీనివాస్‌ను పరామర్శించిన భూమన అభినయ్

సాక్షి టాస్క్ ఫోర్స్: తిరుపతి వార్త పత్రిక ఎడిటర్ శ్రీనివాస్ ఇంటిపై ఆగంతకులు దాడి చేయడంతో వారికి అండగా ఉంటామని భూమన అభినయరెడ్డి హామీ ఇచ్చారు. గురువారం సుబ్బారెడ్డి నగర్‌లోని శ్రీనివాస్ ఇంటిపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేశారు. ఇల్లు ఖాళీ చేయాలంటూ వార్నింగ్ ఇచ్చి భయభ్రాంతులకు గురి చేశారు. ఈయన కొంతకాలంగా టీటీడీ చైర్మన్ కు వ్యతిరేకంగా వరుస కథనాలు ప్రచురించడంతో ఈ దాడికి పాల్పడి ఉండొచ్చని పలువురు భావిస్తున్నారు. ఇప్పటికే అతనిపై టీటీడీ చైర్మన్ ఒత్తిడితో తిరుమల టూటౌన్, వెస్ట్, అలిపిరి పోలీస్ స్టేషన్లలో మూడు కేసులు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో దాడి ఉదంతాన్ని తెలుసుకుని భూమన అభినయరెడ్డి శుక్రవారం పరామర్శించారు. నగరంలో రౌడీలు రెచ్చిపోతున్నారని.. ప్రజలకు రక్షణ లేకుండా పోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. వారి ఇంటిని ఖాళీ చేసి కబ్జా చేసేందుకు రౌడీలు దాడికి పాల్పడినట్లు అనుమానం వ్యక్తం చేశారు.

ఎస్వీయూను ముట్టడించిన ఎస్ఎఫ్ఐ



ఎస్వీయూ పరిపాలనా భవనాన్ని ముట్టడించిన ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు



రిజిస్ట్రార్‌ను నిలదీస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

- సమస్యలపై రిజిస్ట్రార్‌ను నిలదీసిన నాయకులు

తిరుపతి సిటీ: ఎస్వీయూలో పాలన గాడితప్పుతోందని, అధికారులు విద్యార్థుల సమస్యలను పట్టించుకోవడం లేదని నిరసిస్తూ శుక్రవారం వర్సిటీ పరిపాలనా భవనాన్ని ఎస్ఎఫ్ఐ నాయకులు ముట్టడించారు. తక్షణం తప్పుకోవాలని డిమాండు చేశారు. అనంతరం రిజిస్ట్రార్ భూపతి నాయుడును సమస్యలపై నిలదీశారు. ఎస్ఎఫ్ఐ నాయకులు మాట్లాడుతూ, ఎస్వీయూలో పాలన అస్తవ్యస్తంగా తయారైందని డిగ్రీ, పీజీ పరీక్షలు నిర్వహించి నెలలు గడుస్తున్నా ఫలితాలు విడుదల చేయకపోవడం శోచనీయమన్నారు. యూజీసీ నిబంధనల ప్రకారం 45 రోజుల్లో ఫలితాలు విడుదల చేయాల్సి ఉందన్నారు. పరీక్షల విభాగంలో అవినీతి రాజ్యమేలుతోందని. పేద విద్యార్థుల నుంచి వేలాది రూపాయలు వసూలు చేస్తున్నారని మండిపడ్డారు. ఎగ్జామినేషన్ విభాగాన్ని ప్రక్షాళన చేస్తామంటూ ప్రగల్భాలు పలికిన అధికారులు ఆ ఊసే ఎత్తడం లేదని, వర్సిటీ వసతి గృహాలలో నీటి వసతి సమస్యను ఎన్నోసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకున్న పాపానపోవడం లేదని విమర్శించారు. 'రుసా' నిధులు ఆరు నెలలుగా విడుదల కాకపోవడంతో పరిశోధక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మండిపడ్డారు. వర్సిటీలో ఖాళీగా ఉన్న అధ్యాపకుల పోస్టుల తక్షణం భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అక్బర్, రవి, వర్సిటీల కో–ఆర్డినేటర్ అశోక్, వర్సిటీ సెక్రటరీ వినోద్, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

పీఆర్ ఏఈపై పీడీ మండిపాటు

- నిబంధనలను అతిక్రమించి సీసీ రోడ్లు వేశారని ఆగ్రహం
- సామాజిక తనిఖీ బహిరంగ సభలో అక్రమాలు, అవకతవకల చిట్టా వెల్లడి



చేయని పనులకు బిల్లులు పెట్టి స్వాహా చేశారని పీడీకి ఫిర్యాదు చేస్తున్న దీనదయాల్ నాయుడు

చంద్రగిరి: నిబంధనలను అతిక్రమించి సీసీ రోడ్లు వేశారని పంచాయతీరాజ్ ఏఈ రాజాజీపై ఎన్ఆర్ఈజీఎస్ పీడీ శ్రీనివాస ప్రసాద్ మండిపడ్డారు. మండలంలో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద 2024–25 ఆర్థిక సంవత్సరంలో చేసిన రూ.18.67కోట్ల పనులకు సంబంధించి శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సామాజిక తనిఖీ బహిరంగ సభ నిర్వహించారు. పనుల్లో నాణ్యత లేకపోవడం, అవినీతికి పాల్పడినట్లు తేలడంతో సిబ్బందిపై పీడీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏ.రంగంపేటలో జాబ్ కార్డులు అప్‌డేట్ చేయకపోవడం, మస్టర్లలో అవకతవకలకు పాల్పడటం, పశువుల షెడ్ల నిర్మాణంలో నిబంధనలను పాటించలేదని సీఆర్‌పీలు పీడీ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఫీల్డ్ అసిస్టెంట్‌ను అక్కడికక్కడే సస్పెండ్ చేశారు. అలాగే, పిచ్చినాయుడుపల్లెలో మొక్కల పంపిణీలో భారీగా అవినీతికి పాల్పడంపై ఆయన రికవరీకి ఆదేశించారు. రాయలపురం పంచాయతీ తాటికోన సమీపంలోని చెరువులో రూ.3.30లక్షల మేరకు చేసిన పనులను తొలగించి చెరువును ఆక్రమించుకున్నారని, ఆక్రమణదారులపై పోలీసులకు ఫిర్యాదు చేయాలని గతంలో ఆదేశించినా, ఎందుకు చేయలేదని అధికారులను నిలదీశారు. రెడ్డివారిపల్లెలో దొంగ మస్టర్లు, తొండవాడలో వేసిన కాలువలకు దొంగ బిల్లులు పెట్టినట్లు దృష్టికి రావడంతో మండిపడ్డారు. కొటాల పంచాయతీలో వరకాల్వ పనులు చేయకుండానే రూ.9.5లక్షలు స్వాహా చేశారని, విచారణ చేసి చర్యలు తీసుకోవాలని బీజేపీ నేత దీనదయాల్ నాయుడు ఫిర్యాదు చేశాడు.

ఏఈ తీరుపై ఆగ్రహం..అధికారులకు జరిమానా

సీసీ రోడ్ల నిర్మాణంలో నిబంధనలను ఉల్లంఘించి పనులు చేశారని పీఆర్ ఏఈపై అసహనం వ్యక్తం చేశారు. 3.5 మీటర్ల వెడల్పుతో రోడ్డు వేయడానికి బదులు 4 మీటర్లకు పైగా వెడల్పుతో రోడ్డు వేసినట్లు తనిఖీలలో బయటపడింది. సుమారు 20 రోడ్లకు పైగా ఇలా చేసినట్లు తేలడంతో ఆయన తుది నివేదికను కేంద్రానికి పంపనున్నట్లు తెలిపారు. ఇక, ఉపాధి పనుల్లో అవకతవకలకు గాను రూ.54వేల రికవరీ, అధికారుల నిర్లక్ష్యంపై రూ.72 వేలు జరిమానా విధించారు. అలాగే ఇన్‌ఛార్జ్ జేఈ గోపి, టీఏ రవిలకు నోటీసులు జారీ చేయాలని ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ హేమేంద్ర కుమార్ రెడ్డి, ఏపీడీ రెడ్డెప్ప, ఎంపీడీఓ వెంకటరత్నం, ఏపీఓ భార్గవి పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల్లో భక్తుల సౌకర్యాలకు ప్రాధాన్యం



టీటీడీ అధికారులతో సమీక్షిస్తున్న ఈఓ

తిరుమల: బ్రహ్మోత్సవాలకు విచ్చేసే భక్తులకు వసతి, ఇతర సౌకర్యాలకు సంబంధించి ఇబ్బందులు తలెత్తకుండా తిరుమలలోని అన్ని గదుల్లో ఎలక్ట్రిక్ పనులు, మరుగుదొడ్లు, ఇతర మరమ్మతులను సకాలంలో పూర్తిచేయాలని టీటీడీ ఈఓ జే.శ్యామలరావు అధికారులను ఆదేశించారు. బ్రహ్మోత్సవాలపై తిరుమలలోని అన్నమయ్య భవన్‌లో శుక్రవారం ఉదయం అధికారులతో ఈఓ సమీక్షించారు. తిరుమలలోని పలు విశ్రాంతి గృహాలు, కాటేజీల మరమ్మతులను రిసెప్షన్ విభాగంతో సమన్వయం చేసుకుని సకాలంలో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. యాత్రికుల వసతి సముదాయాల్లో కూడా సెంట్రలైజ్డ్ బుకింగ్ సిస్టమ్ అప్లికేషన్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్న ప్రసాద కేంద్రంలో భక్తులు వేచి ఉండే సమయం ఎక్కువగా ఉండంతో మరో ప్రాంతంలో కూడా అన్న ప్రసాద భవనం ఏర్పాటుకు పరిశీలించాలని ఆదేశించారు. రాష్ట్ర ఆహార భద్రతా అధికారులతో తిరుమలలో ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, హోటళ్లలో ఆహార నాణ్యతను పరిశీలించాలన్నారు. అలాగే పంచాయతీ, రెవెన్యూ విభాగం ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, హోటళ్లలో ఏర్పాటు చేసిన ధరల పట్టికను పరిశీలించాలని ఆదేశించారు. భక్తుల సౌకర్యార్థం లడ్డూ ప్రసాద విక్రయ కేంద్రంలోని అన్ని కౌంటర్లు పని చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి నెలా నిర్వహించే ఫీడ్ బ్యాక్ సర్వే ద్వారా వచ్చే భక్తుల అభిప్రాయాలను, సలహాలు, సూచనలను తీసుకుని ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో టీటీడీ అదనపు ఈఓ సీహెచ్ వెంకయ్య చౌదరి, సీఈ సత్య నారాయణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సంస్కృతం మానవ మేధో సంపద



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ నిరంజన్ బాబు

రామచంద్రాపురం: మానవాళి మనుగడను ప్రపంచ దేశాలకు, భారతదేశ ఖ్యాతిని తెలియజేయడమే గాక మానవ మేధోసంపత్తికి సంస్కృత భాష దోహదపడుతుందని ఎస్వీ వైద్య కళాశాలకు వైద్యుడు అల్లాడి మోహన్ అన్నారు. మండలంలోని వెంకట్రామాపురం సెవెన్ హిల్స్ కాలేజీ ఆఫ్ ఫార్మసీ ప్రాంగణంలో శుక్రవారం కేంద్ర సంస్కృత విశ్వవిద్యాలయం (న్యూఢిల్లీ) భాగస్వామ్యంతో సంస్కృత భాష ధ్రువపత్ర కోర్సుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా అల్లాడి మోహన్ మాట్లాడారు. సంస్కృత భాష గొప్పతనాన్ని భాష ప్రాధాన్యతను నైతిక విలువలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ నిరంజన్ బాబు మాట్లాడారు. కేంద్ర సంస్కృత విశ్వవిద్యాలయం ప్రతినిధి సుబ్రహ్మణ్యం, కళాశాల యాజమాన్యం, విద్యార్థులు పాల్గొన్నారు.

'వయ్యారిభామ'ను సమూలంగా నిర్మూలిద్దాం



వయ్యారి భామ కలుపు మొక్కలను తొలగిస్తున్న అధికారులు, విద్యార్థులు

చంద్రగిరి: మండలంలోని గంగుడుపల్లెలో శుక్రవారం కలుపు మొక్క వయ్యారిభామ నిర్మూలనపై శ్రీ వెంకటేశ్వర వ్యవసాయ కళాశాల అవగాహన కార్యక్రమం నిర్వహించింది. కళాశాల అసోసియేట్ డాక్టర్ రమణ, ఎన్జీ రంగా వర్సిటీ సేద్య విజ్ఞాన విభాగం యూనివర్సిటీ హెడ్ డాక్టర్ పీ.మునిరత్నం మాట్లాడారు. వయ్యారి భామ కలుపు మొక్క పంటల దిగుబడిని తగ్గించడమే కాకుండా, పశువులు మేతగా తింటే వాటి పాల ఉత్పత్తి నాణ్యత తగ్గిపోతుందని, అలాగే పశువులు, మనుషులకు వివిధ రకాల రుగ్మతలను ఈ మొక్క కలిగిస్తుందన్నారు. వ్యవసాయ విద్యార్థులు దీని గురించి రైతులకు అవగాహన కల్పించి, వయ్యారిభామ నిర్మూలనకు తోడ్పడాలన్నారు. అనంతరం గ్రామ శివారులో ఉన్న వయ్యారిభామ కలుపు మొక్కలను తొలగించారు. కార్యక్రమంలో కళాశాల సేద్య విజ్ఞాన విభాగాధిపతి డాక్టర్ వీ.చంద్రిక, ప్రొఫెసర్లు డాక్టర్ డీ.సుబ్రహ్మణ్యం, డాక్టర్ ఏవీ.నాగవాణి, డాక్టర్ రెడ్డి రాము, డాక్టర్ మోహన్ నాయుడు, పరిశోధక విద్యార్థులు పాల్గొన్నారు.

ఈవీఎంల టాంపరింగ్‌తోనే మోదీకి అధికారం!

- జగన్ తెచ్చిన మెడికల్ కాలేజీలను గాలికొదిలేసిన కూటమి ప్రభుత్వం
- కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ ధ్వజం



మాట్లాడుతున్న డాక్టర్ చింతామోహన్

తిరుపతి కల్చరల్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మూడుసార్లు వ్యవస్థలను చేతిలో పెట్టుకుని, ఈవీఎంల టాపరింగ్‌తో అధికారంలో వచ్చి, అవినీతి పాలన సాగిస్తోందని కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత డాక్టర్ చింతామోహన్ ఆరోపించారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ స్కాములపై మాట్లాడుతున్నా నోరెత్తడం లేదని మండిపడ్డారు. రాష్ట్రంలో కూటమి పాలన అట్టర్‌ఫ్లాప్ అయ్యిందని విమర్శించారు. మోదీని, మీడియాను చేతిలో పెట్టుకుని సీఎం చంద్రబాబు నాయుడు ఇష్టారాజ్యంగా పాలన సాగిస్తున్నారని ధ్వజమెత్తారు. టీటీడీని రాజకీయ ప్రయోజనాల వాడకుంటూ భ్రష్టు పట్టిస్తున్నారని దుయ్యబట్టారు. వర్సిటీల్లో పాలన గాడి తప్పిందని విమర్శించారు. మదనపల్లె, పులివెందులలో జగన్ తెచ్చిన మెడికల్ కాలేజీలను కూటమి ప్రభుత్వం పట్టించుకోక గాలికి వదిలేయడం దుర్మార్గమని నిరసించారు. రుయా ఆస్పత్రికి నిధులు లేక నీరసిస్తోందన్నారు. సమావేశంలో కాంగ్రెస్ నేతలు యార్లపల్లి గోపి, రవి, తేజోవతి, రావణ్, ముని శోభ, వెంకటేష్ గౌడ్, సమీన్‌వుల్లా పాల్గొన్నారు.

లక్ష కుంకుమార్చన



శ్రీకపిలేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం శ్రీకామాక్షి అమ్మవారి లక్ష కుంకుమార్చన శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ ఆవరణలోని మండపంలో మహాలక్ష్మి, సరస్వతి, కామాక్షి అమ్మవార్లను కొలువుదీర్చి ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ డెప్యూటీఈఓ నాగరత్న, ఏఈఓ సుబ్బరాజు, సూపరింటెండెంట్ చంద్రశేఖర్, ఇతర అధికారులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు. – తిరుపతి కల్చరల్

నోటీస్ బోర్డు

- ఉదయం 4.45 గంటలకు శ్రీగోవిందరాజ స్వామి తిరుమాడ వీధులలో నగర సంకీర్తన.
- శ్రీకోదండరామస్వామి వారి ఆలయంలో ఉదయం 9 గంటలకు సహస్ర కలశాభిషేకం, రాత్రి 7 గంటలకు స్వామివారి హనుమంత వాహన సేవ.
- రాముల వారి దక్షిణ మాడ వీధిలోని చిగోరా ఆధ్యాత్మిక సేవా కేంద్రంలో సాయంత్రం 4.30 గంటలకు టంగుటూరి ప్రకాశం పంతులు 154వ జయంతి వేడుకలు.

మాధవికి డాక్టరేట్



తిరుపతి రూరల్: శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, విద్యా విభాగం పరిశోధక విద్యార్థిని ఎస్.మాధవికి డాక్టరేట్ ప్రకటించినట్లు డీన్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఆచార్య అనురాధ తెలిపారు. ఈమె ఆచార్య సునీతబాయ్ పర్యవేక్షణలో మేథమేటిక్స్‌కు సంబంధించి విద్యార్థులపై చేసిన పరిశోధనకు డాక్టరేట్ ప్రకటించారు.

3 నుంచి గోవిందుని పవిత్రోత్సవాలు

తిరుపతి కల్చరల్: శ్రీగోవిందరాజస్వామి ఆలయంలో వచ్చే నెల 3 నుంచి 5వ తేదీ వరకు పవిత్రోత్సవాల నిర్వహించనున్నారు. 2న సాయంత్రం అంకురార్పణతో ఈ ఉత్సవాలు మొదలవుతాయి. 3న ఉదయం పవిత్ర ప్రతిష్ఠ, సాయంత్రం యాగశాలలో వైదిక కార్యక్రమాలు, 4న మూలమూర్తులు, ఉత్సవర్లకు, విమాన ప్రాకారానికి, ధ్వజస్తంభానికి, మాడ వీధుల్లోని శ్రీమఠం ఆంజనేయస్వామికి పవిత్రాలు సమర్పిస్తారు. 5న పూర్ణాహుతితో పవిత్రోత్సవాలు పరిసమాప్తమవుతాయి.

ముగిసిన తిరునాళ్ల

తిరుపతి రూరల్: మండలంలోని దుర్గసముద్రం జగనన్న కాలనీలో నిర్వహిస్తున్న గుండాల గంగమ్మ తిరునాళ్ల శుక్రవారం ముగిసింది. వారం పాటు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, దీపారాధన చేసి, అమ్మవారికి కాలనీ వాసులు పొంగళ్లు నైవేద్యంగా సమర్పించి పూజలు చేశారు. అమ్మవారి ఆలయం వద్ద భక్తులకు సౌకర్యాల కల్పనకు కాలనీ వాసి నరసింహారెడ్డి కుటుంబీకులు సుమారు రూ.5లక్షల వరకు వ్యయం చేశారు.

ప్రశాంత వాతావరణలో వినాయక ఉత్సవాలు



చంద్రగిరి, రామచంద్రాపురం మండలాల్లో సమావేశమైన అధికారులు

చంద్రగిరి/రామచంద్రాపురం: ప్రశాంత వాతావరణంలో వినాయక ఉత్సవాలను నిర్వహించాలని అధికారులు కోరారు. శుక్రవారం చంద్రగిరిలో తహసీల్దార్ శివరామసుబ్బయ్య, ఇన్‌చార్జ్ సీఐ ఇమ్రాన్ బాషా, రామచంద్రాపురంలో తహసీల్దార్ మధుసూదన్‌రావు తమ కార్యాలయాల్లో పోలీస్, రెవెన్యూ, ట్రాన్స్‌కో తదితర అధికారులతో సమావేశం నిర్వహించారు. 27న మండలాల్లో నిర్వహించే వినాయక చవితి పండుగ వేడుకలపై సమీక్షించారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చర్యలపై చర్చించారు. మండపాల ఏర్పాటుకు నిర్వాహకులు విధిగా అనుమతులు పొందాలని స్పష్టం చేశారు.

పంబ వాయిద్య కళాకారులకు సత్కారం



జానపద కళాకారులను సత్కరిస్తున్న నిర్వాహకులు

తిరుపతి కల్చరల్: ప్రపంచ జానపద దినోత్సవం పురస్కరించుకుని ఎం.బలరామరెడ్డి మెమోరియల్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో పంబ కళాకారులను ఘనంగా సత్కరించారు. ఎస్వీయూ టీచర్స్ అసోసియేషన పూర్వ అధ్యక్షుడు ఆచార్య పుట్టా మునిరత్నం రెడ్డి, ఏపీ తెలుగు అకాడమి వ్యవస్థాపక డైరెక్టర్ ఆచార్య పేట శ్రీనివాసులురెడ్డి మాట్లాడారు. తిరుపతి గంగమ్మకు వందల ఏళ్ల నుంచి పంబల రాయిస్తూ, గంగమ్మ కథను పాడే పంబల వాయిద్యగాళ్ల కుటుంబానికి చెందిన మోహన్, కిరణ్‌కుమార్ అభినందనీయులని కొనియాడారు. కార్యక్రమంలో ఎస్వీయూ విశ్రాంత వీసీ ఆచార్య పి.జయరామరెడ్డి, ఆలయ ఈఓ ఏ.జయకుమార్, ఎస్.హరీష్, డాక్టర్ కోడూరు జయప్రకాష్ పాల్గొన్నారు.